విద్యారంగ సమస్యలపై శాసన మండలిలో చర్చించండి

ఎమ్మెల్సీ కవితకు పీడీఎస్‌యూ విజ్ఞంభణ వినతి



రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై శాసనమండలిలో చర్చించాలని ఎమ్మెల్సీ కవితను పీడీఎస్‌యూ విజ్ఞంభణ నాయకులు కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా నేటికీ విద్యాశాఖకు పూర్తిస్థాయి మంత్రిని నియమించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విద్యారంగంలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటిని పరిష్కరించాల్సిన ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆరోపించారు. రాష్ట్ర బడ్జెట్లో 20% నిధులను విద్యారంగానికి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు అల్లూరి విజయ్, పల్లెబోయిన జానీ, పవన్, శ్రీహరి, సాయి వర్ధన్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

– ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 8

నెర్రెలు వారిన పొలం చూసి గుండె పగిలేలా గిరిజన రైతు రోదన

ఎండిన వరి పొలంలో పడి ఏడుస్తున్న రైతు కరెంటోతు భాస్కర్

సంస్థాన్ నారాయణపురం, మార్చి 8 : వేల రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన వరి పంట చేతికి వచ్చే సమయంలో నీళ్లు లేక ఎండిపోతుండడం చూసి రైతు గుండె తల్లడిల్లింది. నెర్రెలు వారిన పంట చేనును చూసి యాదాద్రి భువనగిరి జిల్లా రైతు గుండెలు బాదుకుంటూ ఏడ్చారు. సంస్థాన్‌నారాయణపురం మండలం డాకుతండాకు చెందిన రైతు కరంటోతు భాస్కర్ తనుకు ఉన్న ఎకరంతో పాటు మరో ఎకరన్నర కౌలుకు తీసుకుని వరి సాగు చేశాడు. తీరా పంట చేతికి వచ్చే సమయానికి బోరు ఎండిపోడంతో నీళ్లు లేక పంటంతా ఎండిపోయింది. దాంతో పశువుల మేతకు వదిలిపెట్టాడు. శనివారం చేను దగ్గరికి వచ్చిన భాస్కర్ వరి పొలంలో పడి బోరున ఏడ్చాడు.లక్షన్నర రూపాయలు అప్పు చేసి పెట్టుబడి పెట్టానని, ప్రభుత్వమే ఆదుకోవాలని వేడుకున్నాడు.

మిలియన్ మార్చ్ డేను జయప్రదం చేయండి

తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన నిర్వహించనున్న మిలియన్ మార్చ్ డే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని జేఏసీ ప్రధాన కార్యదర్శి తుమ్మల ప్రపుల్ రాంరెడ్డి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌కబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఉద్యమకారులకు 250గజాల ఇంటి స్థలం, రూ.30వేల గౌరవ వేతనం ఇస్తామనే హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. 10న అమరజ్యోతి నుంచి గన్‌పార్కు వరకు ర్యాలీ నిర్వహిస్తున్నామని, మేధావులు, ప్రజా సంఘాలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొంటారని తెలిపారు. అనంతరం మిలియన్ మార్చ్‌డే పోస్టర్లను జేఏసీ సలహాదారులు బోయపల్లి రంగారెడ్డి, చైర్మన్ ఉల్తాన్ యాదగిరి, కోశాధికారి చంద్రన్న ప్రసాద్, మహిళా అధ్యక్షురాలు కె. మాధవి రెడ్డి, వేముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

– ఖైరతాబాద్, మార్చి 8

ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ చేయాలి

సమావేశం అనంతరం నినదిస్తున్న ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 8: రాష్ట్రంలో ఎంబీఎస్సీ కులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని 57 ఎంబీఎస్సీ కులాల హక్కుల పోరాట సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బైరి వెంకటేశం రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటేశం మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం.. ఎంబీఎస్సీ ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ.1000 కోట్ల బడ్జెట్ కేటాయించాలని కోరారు. ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లో ఈ మేరకు తీర్మానం చేయాలని విజ్ఞప్తి చేశారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు తహసీల్దార్ ద్వారా ఇవ్వాలన్నారు. వచ్చే నెలలో జరిగే మహనీయుల జయంతి ఉత్సవాల కమిటీ బాధ్యతలు ఈసారి ఎంబీఎస్సీ కులాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమితి రాష్ట్ర నాయకులు ఉపదే సనధన్ మాంగ్ గారోడి, కురువ వెంకన్న, మాదాసి కురువ, కొల్పుల నవీన్, పంబాల ఎల్లేశ్, కురువ బాలరాజు, ఉపదే మహేశ్, కాంబ్లే విజయ్, కాంబ్లే గోపి, కొల్పుల గోవర్ధన్, సకట్ సంజీవ్, జీత్లాల్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి



మహిళా ఉద్యోగులను సత్కరించిన యూనియన్ నేతలు

సిటీ బ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ): వైద్య, ఆరోగ్య శాఖలో మహిళా దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ వైద్య, ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదమ్మ అన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మహిళా దినోత్సవం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఏటా అన్ని క్యాడర్లలో ఉత్తమ సేవలందించిన మహిళా ఉద్యోగులను అవార్డులతో సత్కరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సమస్యలపై సంబంధిత మంత్రి మూడు నెలలకోసారి గ్రీవియన్స్ నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కర్నాటి సాయిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజశేఖర్, మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు.

6,410మంది రైతులకే.. యాసంగి రైతు భరోసా

మేడ్చల్‌లో 14,300 ఎకరాలకు అందించాల్సి ఉన్నది.. మిగతా రైతులకెప్పుడో..? రైతుల ఎదురుచూపులు



మేడ్చల్, మార్చి 8 (నమస్తే తెలంగాణ): రైతు భరోసా పథకంపై నమ్మకం కోల్పోతున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో యాసంగిలో 14,300 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా అందించేలా ప్రభుత్వం నిర్ణయించింది. అరకొర రైతులకు ఇచ్చే రైతు భరోసానైనా సకాలంలో అందిస్తారనుకుంటే అది లేదు అంటూ రైతులు వాపోతున్నారు. యాసంగిలో 14,300 ఎకరాలకు రైతు భరోసా అందించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు 6,410 మంది రైతులకు మాత్రమే రైతు భరోసాను అందించగా.. మిగతా రైతులు తమకు ఎప్పుడు రైతు భరోసా పడేదని ఎదురు చూపులు తప్పడంలేదు. జిల్లాలో 40,960 మంది రైతులకు ఉన్న పట్టాదారు పాస్‌పుస్తకాలలో 82వేల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. యాసంగిలో 14,300 ఎకరాలకు మాత్రమే రైతు భరోసా పథకాన్ని వర్తింపజేయగా.. మిగతా 64వేల పైచిలుకు ఎకరాలకు రైతు భరోసాను ప్రభుత్వం కట్ చేసినట్లయింది. జిల్లాలో 64,794 ఎకరాలు సాగుకు అనుకూలంగా ఉన్నట్లు గుర్తించిన అధికారులు.. యాసంగిలో మాత్రం 14,300 ఎకరాలకు మాత్రమే రైతు భరోసాను అందించడంపై రైతులు విస్మయానికి గురవుతున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరానికి ఎకరానికి రూ.12వేలు రెండు దశల్లో చెల్లించాలని తీసుకున్న నిర్ణయం సరిగా అమలు కావడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 79,844 ఎకరాలకు 'రైతుబంధు'

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 79,844 ఎకరాలకు రైతుబంధు పథకాన్ని అందించింది. 81వేల ఎకరాల వ్యవసాయ భూములకు పంట పెట్టుబడి సాయం కింద 48,072 మంది రైతులు ఉండగా.. రైతు బంధు పథకం కోసం బ్యాంకు ఖాతాలు పొందుపరచిన 35,877 రైతులకు సీజన్‌ల వారీగా రూ.33కోట్ల 25లక్షలు రైతుబంధును రైతుల ఖాతాల్లో జమ చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రైతులకు అన్ని రకాలుగా ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొంటున్నారు. అర్హులైన రైతులందరికి రుణమాఫీ అందిస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చినా రుణమాఫీ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 3,600 మంది రైతులకు మాత్రమే జరిగిందన్నారు. రుణమాఫీ వర్తింజేయాల్సిన రైతులు ఆందోళన చేసినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.

అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో పోటీపడేలా ఎదగాలి

500 కోట్ల నిధులతో కోఠిలోని వీరనారీ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో శంకుస్థాపన చేసిన సీఎం రేవంత్ రెడ్డి

కోఠిలోని చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో శంకుస్థాపన చేస్తున్న సీఎం

సుల్తాన్ బజార్,మార్చి 8: వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం అంతర్జాతీయ స్థాయి యూనివర్సిటీలతో పోటీపడేలా ఎదగాలని సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులకు సూచించారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని పోటీలోని వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో రూ.535కోట్ల నిధులతో నూతన భవన నిర్మాణాలు, చారిత్రాత్మకమైన పురావస్తు కట్టడాల పునరుద్ధరణ పనులకు గాను ఆయన, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ ఘంటా చక్రపాణి, ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఎం కుమార్, మహిళా వర్సిటీ బీసీ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డిలతో కలిసి భూమి పూజ చేసి నూతన భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. అంతకు ముందు వర్సిటీ ఎన్‌సీసీ విద్యార్థులు సీఎం రేవంత్‌రెడ్డికి గౌరవ వందనం సమర్పించారు.దర్బార్ హాల్లో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్ ఆయన తిలకించారు. అనంతరం వర్సిటీ ఆవరణలో ఏర్పాటు చేసిన సభా వేదికపై మంత్రులు అధికారులతో కలిసి వచ్చి చాకలి ఐలమ్మ చిత్రపటానికి పూలమాలవేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. రాష్ట్రంలోని పలు యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, కళాశాల ప్రిన్సిపాల్‌లు, లెక్చరర్లు, అధ్యాపకులు, బోధన బోధనేతర సిబ్బంది, పలు కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, సుల్తాన్ బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసచారి లతో కలిసి బందోబస్తును పర్యవేక్షించారు. సీఎం రేవంత్ రెడ్డికి ప్రమాదం తృటిలో తప్పింది. కాగా, వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య భూమి పూజ చేసిన అనంతరం ఇటుకలను పేర్చే క్రమంలో ఒక్కసారిగా గుంతలో పడిపోతుండగా.. వెంటనే తేరుకున్న సీఎం అక్కడి నుంచి వెళ్లిపోయారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి



తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క

చిక్కడపల్లి, మార్చి 8:ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు తిప్పర్తి యాదయ్య ఆధ్వర్యంలో నూతనంగా ముద్రించిన డైరీని శనివారం మల్లు భట్టి విక్రమార్క ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన వివరాలను సంఘం అధ్యక్షుడు తిప్పర్తి యాదయ్య బాగ్‌లింగంపల్లిలోని సంఘం కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. కార్యక్రమంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగుల సంఘం ప్రెసిడెంట్ శ్యామ్, డాక్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి లల్లు ప్రసాద్ యాదవ్,యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగన్‌మోహన్, అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి చెవ్వ కృష్ణ, సంయుక్త కార్యదర్శి బి.రమేశ్, మండల రవి పాల్గొన్నారు.

బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

పటోళ్ల కార్తీక్ రెడ్డి

బీఆర్ఎస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించిన రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి

బండ్లగూడ, మార్చి 8 : రాజేంద్రనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పటోళ్ల కార్తీక్ రెడ్డి పేర్కొన్నారు. బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు రావుల కొల్ల నాగరాజు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు కార్తీక్ రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కార్తీక్ రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలన పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. త్వరలోనే పలు నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రానున్నట్లు తెలిపారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్ పార్టీలో చేరేందుకు ముగ్గు చూపుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారు కాంగ్రెస్ నాయకులు గాజుల చంద్ర శేఖర్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్, శ్రవణ్, రాంబాబు, నాగరాజ్, సుభాని, బాలాజీ, నరేశ్, మహేశ్ గౌడ్, రామ్‌కుమార్, రాజు ఉన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ నాయకులు, గంగని రవికుమార్, మహేశ్, శాంతకుమార్, రాజ్‌కుమార్, శాంతిబాయ్, హాజీ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపేట : జెల్ల సత్యనారాయణ స్టాల్‌ను పరిశీలిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

రాష్ట్రపతి భవన్‌లో సిరిపురం చేనేత వస్త్రాల ప్రదర్శన

రామన్నపేట, మార్చి 8 : ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా దేశ రాజధాని ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఏర్పాటు చేసిన సౌత్ ఇండియా చేనేత హస్తకళ ప్రదర్శనను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. ఈ ప్రదర్శనలో పాల్గొనే అవకాశం మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన కళాభారతి హ్యాండ్లూమ్స్ కంపెనీకి చెందిన జెల్ల శ్రీనాథం, జెల్ల సత్యనారాయణకు దక్కింది. రాష్ట్రం నుంచి ఏర్పాటు చేసిన 20 ప్రదర్శనల్లో కళాభారతి హ్యాండ్లూమ్స్ ప్రొడ్యూసర్ కంపెనీ ఒకటి. సంస్థ ద్వారా ఉత్పత్తి చేసిన పోచంపల్లి పట్టు చీరెలు, మెర్స్‌రైజడ్ చీరెలు, బెడ్‌షీట్లు, డ్రెస్ మెటీరియల్, చున్నీలను ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, రాష్ట్ర గవర్నర్ బిష్ణుదేవ్ వర్మ, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క స్టాల్‌ను సందర్శించి అభినందించినట్లు సంస్థ నిర్వాహకులు సత్యనారాయణ, శ్రీనాథం తెలిపారు.

హోప్ యాడ్ టీవీ, సుజనరంజని సంగీత కచేరీ

మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని హోప్ యాడ్, సుజనరంజని సంయుక్తంగా శనివారం శ్రీవిద్య జానకిరామన్ గాత్ర సంగీత కచేరీ ఏర్పాటు చేశాయి. కచేరీలో త్యాగరాజ స్వామి, ముత్తు స్వామి దీక్షితార్, శ్యామశాస్త్రి, ముత్తయ్య భాగవతార్ కీర్తనలు ఆలపించారు. వయోలిన్ పవన్ సింగ్, మృదంగం రామకృష్ణ, ఘటం బాలసుబ్రహ్మణ్యం వాయించారు. ఈ సందర్భంగా నిత్యజీవితంలో మహిళల పాత్రను మహీధర సీతారాం వివరించారు. హోప్ డైరెక్టర్ సునీత కళాకారులను సత్కరించారు.

– సిటీబ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ)

సఫారీ స్టీల్త్ స్పెషల్ ఎడిషన్ విడుదల

జూబ్లీహిల్స్‌లోని టాటా వెంకటరమణ ఉమెన్స్ షో రూమ్‌లో టాటా వారి సరికొత్త సఫారీ స్టీల్త్ స్పెషల్ ఎడిషన్‌ను మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఇండియన్ మార్కెట్‌లో టాటా సఫారీ విడుదలై 27 ఏండ్లు పూర్తైన సందర్భంగా 2700 టాటా సఫారీ స్టీల్త్ ఎడిషన్, టాటా హారియర్ ఎస్‌యూవీను టాటా మోటార్స్ ఆధ్వర్యంలో మార్కెట్లోకి విడుదల చేశారు. వీవీసీ మోటార్స్ ఎండీ వీవీ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో టీవీ నటి తేజస్విని అమర్దీప్ చేతుల మీదుగా షోరూం మేనేజర్ నిరోషతో కలిసి కొత్త సఫారీ స్టీల్త్ ఎడిషన్‌ని మార్కెట్‌లోకి విడుదల చేశారు.

–సిటీబ్యూరో, మార్చి 8(నమస్తే తెలంగాణ)

నీళ్లు.. నిధులు కావాలె..

డీఆర్‌సీ సమావేశంలో మంత్రుల ఎదుట ఎమ్మెల్యేల ఏకరువు

- గతేడాది చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుంటే పనులెలా చేయించాలంటూ ప్రశ్నలు
- పలు సమస్యలు లేవనెత్తినా స్పందించని మంత్రులు
- అధికారులు క్షేత్రస్థాయిలో ఉండాలంటూ సమావేశం ముగించిన మంత్రులు

డీఆర్‌సీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

నీలగిరి, మార్చి 8 : నల్లగొండ కలెక్టరేట్‌లోని ఉదయాదిత్య భవన్‌లో శనివారం జరిగిన ఉమ్మడి జిల్లా డీఆర్‌సీ సమావేశంలో పలు సమస్యలను ఎమ్మెల్యేలు జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎదుట ఏకరువు పెట్టారు. సమస్యల కారణంగా ప్రజల్లోకి వెళ్లలేక పోతున్నామని, రైతులు, ప్రజలు నిలదీస్తున్నారని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో సర్పంచులు లేక నిధుల కొరత కారణంగా పంచాయతీ కార్యదర్శులు, ప్రత్యేక అధికారులు నల్లా ట్యాప్‌లు సైతం పెట్టలేకపోతున్నారని మంత్రుల దృష్టికి తీసుకొచ్చారు. గ్రామాల్లో తాగునీరు లేదని ఖాళీ బిందెలతో ప్రజలు, పంటలు ఎండుతున్నాయని రైతులు నిలదీస్తున్నారని పేర్కొన్నారు. గతేడాది చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో వారితో ఇప్పుడు పనులు ఎలా చేయించాలని ప్రశ్నించారు. అయితే.. సభలో ఏర్పాటు చేసిన మైకు పనిచేయకపోవడంతో ఎమ్మెల్యేలు మైకు లేకుండానే మాట్లాడారు. ప్రశ్నించిన ఎమ్మెల్యేలకు మంత్రులు సమాధానం ఇవ్వలేదు. సీఎం దృష్టికి తీసుకెళ్తామని, అధికారులు స్థానికంగా ఉండాలని చెప్పారు. శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా ఎమ్మెల్యేలు, మూడు జిల్లాల కలెక్టర్లు, నీటిపారుదల, విద్యుత్, నీటిసరఫరా విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా, పంటలు ఎండిపోకుండా, విద్యుత్ సరఫరా సక్రమంగా కొనసాగేలా సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటి ఇబ్బంది రాకుండా ఈఎన్‌సీ స్థాయిలో దృష్టి సారించాలని సూచించారు. పంటలు ఎండిపోకుండా ఇంజినీరింగ్ అధికారులు కాల్వలపై పర్యటించాలని, విద్యుత్ అధికారులతో కలిసి నీటి పర్యవేక్షణ చేయాలని అన్నారు. శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి మాట్లాడుతూ తక్షణ అవసరాల కోసం ప్రతి జిల్లాకు ఐదు కోట్లు, నల్లగొండ జిల్లాకు రూ.15కోట్లు నిధులు ఉంచాలన్నారు. తాగునీటి సమస్య ఉంటే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు. సాగునీటి నిర్వహణ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్ అధికారులు పూర్తి స్థాయిలో సేవలు అందించాలన్నారు. జిల్లా కలెక్టర్లు తాగునీటిపై ఎక్కువ దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య మాట్లాడుతూ గుండాల మండలంలో 50శాతం పంటలకే నీరు వస్తుందని, మరో వారంపాటు 200 క్యూసెక్కుల నీటిని వదలాలని కోరారు. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ, బోరు నీళ్లు కలిసిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బస్వాపురం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ వసీకరణ చెల్లింపులు చేపట్టాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి కోరారు. మూసీలో గుర్రెపు డెక్క ఉండడంతోపాటు మోటార్లు వేయడంతో చివరి భూములకు నీరు వస్తలేదన్నారు. మూసీ పరిధిలో మోటార్లు బంద్ ఉండేందుకు రాత్రి పూట కరెంట్ కట్ చేయాలని ఆదేశాలు జారీ చేయాలన్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ మాట్లాడుతూ తమ ప్రాంతంలో వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోతుందని, బిక్కేరు వాగు నుంచి నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని కోరారు. ఎస్సారెస్పీ కింద బిక్కుమల్ల వరకు నీరు రావడం లేదని, కాల్వల్లో నిండిపోయిన చెత్తను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్‌రెడ్డి మాట్లాడుతూ తండాల్లో కొత్త బోర్లు వేసేందుకు అనుమతులు ఇవ్వాలని, హాలియా మున్సిపాలిటీకి నీటిని అందించే నిడుమనూరు చెరువును నింపాలని అన్నారు. నీటిసరఫరాలో భాగంగా క్రిటికల్ గ్యాస్‌ను పూర్తి చేసి పెండ్లిపాకల ప్రాజెక్టు కింద ఏజెన్సీ జీతాలు చెల్లించాలని, చిన్న పనులు కూడా చేయలేని దుస్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయని దేవరకొండ ఎమ్మెల్యే బాలూనాయక్ అవేదన వ్యక్తం చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ గత ఎండాకాలంలో అద్దెకు తీసుకున్న ట్యాంకర్లకు, బోర్లకు అద్దెలు ఇవ్వలేదని, వారితో ఇప్పుడు మళ్లీ ఎలా పనులు చేయించాలని ప్రశ్నించారు. రామన్నపేట, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, ఆసిఫ్‌నెహర్ నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం విన్నవించారు. కోదాడ ఎమ్మెల్యే పద్మావతి మాట్లాడుతూ చివరి భూముల వరకు సాగునీరు అందించాలని, ఇరిగేషన్, అగ్రికల్చర్ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం వల్ల నీటి విషయంలో స్పష్టత లేదని అన్నారు. అంతకుముందు ఉమ్మడి జిల్లాలో విద్యుత్, ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలపై కలెక్టర్లు చర్చించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతిని మంత్రులు సన్మానించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఇందిరమ్మ ఇల్లు నమూనాను ప్రారంభించారు. సమావేశంలో కలెక్టర్లు ఇలా త్రిపాఠి, హనుమంతరావు, తేజస్ నందలాల్ పవార్, నల్లగొండ ఎస్పీ శరత్‌చంద్ర పవార్, మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి, ఇరిగేషన్ ఈఎన్‌సీ హరిలాల్, చీఫ్ ఇంజినీర్ అజయ్‌కుమార్, అదనపు కలెక్టర్ శ్రీనివాస్, సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ పాల్గొన్నారు.